సాక్షి
బాపట్ల

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023




లక్ష్మీ నృసింహస్వామి ఆదాయం

మంగళగిరి : శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారికి రూ. 45,21,877 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి శనివారం తెలిపారు.



కోటయ్య హుండీ ఆదాయం ..

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి హుండీల ద్వారా రూ.51,43,869లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ జి. శ్రీనివాసరెడ్డి తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

126 కేజీల శివలింగాకార లడ్డూ



అద్దంకి రూరల్: వినాయక పందిరిలో ప్రసాదంగా ఉంచేందుకు అద్దంకిలోని నవయుగ స్వీట్ షాప్ యజమానులు వెంగళరావు, హనుమాన్ సిబ్బంది 126 కేజీల శివలింగాకారంలో లడ్డూను తయారు చేశారు. కాజు, బాదం, డ్రై ఫ్రూట్స్ ఉపయోగించి మూడు అడుగుల ఎత్తులో ఆకర్షణీయంగా తయారు చేశారు.

స్పందన కార్యక్రమం రద్దు

బాపట్లటౌన్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం గాంధీ జయంతి సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేయటం జరిగిందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించాలన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎమ్‌బీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలలో డిప్లమో కోర్సులకు మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి. శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 9–30 గంటలకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయన్నారు. పాలిసెట్–2023లో అర్హత సాధించినా, సాధించకపోయినా ఆసక్తిగల విద్యార్థులు తమ పదవ తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, రూ.5,800 ఫీజు చెల్లించి అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు.

గణనాథుని లడ్డూ రూ.8,11,111



గుంటూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్–2 శ్రీరాంనగర్ 11వ లైనులో గణనాథునికి ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి లడ్డూ ప్రసాదం విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా నగరాలు డివిజన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆరిక శ్రీనివాసరెడ్డి, చల్లా బసివిరెడ్డి, మున్నంగి సాయిసుందర్‌రెడ్డి, పొన్నపాటి శ్రీకాంత్‌రెడ్డిలు 8,11,111 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాదం లడ్డూతో ఊరేగింపుగా భక్తుని ఇంటికి చేర్చారు. అనతరం స్వామి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా చేశారు.

రేపు తెనాలిలో త్రోబాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

తెనాలి: ఆంధ్రప్రదేశ్ పురుషులు మహిళల త్రోబాల్ జట్ల ఎంపిక అక్టోబరు 2వ తేదీన తెనాలిలో జరగనుంది. ఇక్కడి బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ క్రీడామైదానంలో ఉదయం 10 గంటలకు జట్ల ఎంపిక జరుగుతుందని త్రోబాల్ అసోసియేషన్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికైన జట్లు అక్టోబరు 22, 23, 24 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు.

అందరి రక్ష.. ఆరోగ్య సురక్ష

- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున
- మున్నంగివారి పాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం



మున్నంగివారి పాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మందులు, కేస్ షీట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

మున్నంగివారి పాలెం(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు శ్రీ రామరక్షగా నిలుస్తోందని, ప్రభుత్వం ప్రజల గడప వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని మున్నంగివారి పాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంత్రి మేరుగ నాగార్జున శనివారం ప్రారంభించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలను వైద్యసిబ్బంది అందిస్తారన్నారు. విద్య, వైద్య సక్రమంగా ఉంటేనే ప్రతి కుటుంబం బాగుంటుందని ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. గ్రామంలో 402 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని చదలవాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. వలంటీర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బొంత అర్జున రావు, ఎంపీపీ జాలాది రూబేను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అన్నవరపరెడ్డి రఘువీరారెడ్డి, సర్పంచ్‌లు వుయ్యూరి అప్పిరెడ్డి, సుబ్బారెడ్డి, కోటి రెడ్డి, పందిపాటి ఏసు, ఉపాధ్యక్షుడు రమణా రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో మేలు

పర్చూరు (చినగంజాం): జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందని బాపట్ల జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. ఈ పథకం ద్వారా వైద్య సిబ్బంది రోగుల ఇళ్లవద్దకు వెళ్లి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. శనివారం ఆయన మండలంలోని నూతలపాడు సచివాలయం వద్ద నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను ఆయన సందర్శించారు. నయం కాని రోగాలను కార్పొరేట్ ఆసుపత్రిలో ప్రభుత్వ ఖర్చులతో వ్యాధులను దూరం చేస్తారని చెప్పారు. ఏర్పాటు చేసిన క్యాంప్‌లో వివిధ వైద్య పరీక్షల తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సంధ్యశ్రీ, ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్, సీడీపీఓ సుభద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం..

బాపట్ల అర్బన్: పేదల ఆరోగ్యానికి శ్రీరామరక్ష రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. బాపట్ల మండలం పాండురంగాపురంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వరు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ప్రతి ఇంటికీ వైద్యాన్ని తీసుకెళుతోందని చెప్పారు. గతంలో చిన్నపాటి అనారోగ్య సమస్యకు పట్టణంలోని ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రతి పల్లెకూ ఫ్యామిలీ డాక్టర్ వస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఆరోగ్య పరీక్షలు సైతం ఇంటింటికీ వెళ్లి నిర్వహించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.



దేవినూతలలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ శ్రీధర్



పాండురంగాపురంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారని, పేదల ఆరోగ్యాన్ని కంటి పాపలా కాపాడుతున్నారని అన్నారు. జేసీ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం వైద్యం అందిస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 800 మంది టోకెన్ తీసుకోగా 415 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 29 మంది గైనిక్, 65 మంది కంటి సమస్యలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. మిగిలిన 306 మంది జనరల్ పరీక్షలు చేయించుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరు రాణి, బాపట్ల ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దేవినూతలలో...

చీరాల టౌన్: ప్రజలందరికీ అనారోగ్య సమస్యలను నిర్మూలించి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని జేసీ చామకూరు శ్రీధర్ సూచించారు. శనివారం చీరాల మండలంలోని దేవినూతల గ్రామంలో ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు తీరును ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు, పౌష్టికాహారం, హెల్ప్‌డెస్క్, అందిస్తున్న సేవలు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, రక్త పరీక్షలు చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఉన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా టీటీకే రెడ్డి



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ తేలుకుట్ల త్రిపురాంతకేశ్వర రెడ్డి శనివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కుసుమ జీవన్ ప్రదీప్ ఉద్యోగ విరమణ చేయడంతో టీటీకే రెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ డీఎంఈ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ టీటీకే రెడ్డి ప్రస్తుతం వైద్య కళాశాల ఫోరెన్సిక్ వైద్య విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో 1981లో ఎంబీబీఎస్, 1993లో పీజీ వైద్య విద్యను ఆయన పూర్తి చేశారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. అనంతరం గుంటూరు వైద్య కళాశాలకు బదిలీ అయి 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2008లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా 2020 నుంచి 2022 వరకు పనిచేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ టీటీకే రెడ్డిని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ఉమాజ్యోతి, పలువురు కార్యాలయ ఉద్యోగులు, వైద్యులు, తదితరులు అభినందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3800 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 206 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1001 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 550 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 120 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 280 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 760 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

ఉపాధికి ఊతం.. యువతకు ప్రోత్సాహం

- ప్రధానమంత్రి ఉపాధికల్పన పథకంతో చిన్న పరిశ్రమల అభివృద్ధి
- ఎంఎస్ఎంఈ ద్వారా గరిష్టంగా 35శాతం వరకు సబ్సిడీ
- సర్వీస్, ఉత్పత్తి రంగాల్లో వ్యాపార ఆవిష్కరణలకు ఊతం
- గరిష్టంగా రూ.50లక్షల వరకు రుణం



జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. పరిశ్రమలను ప్రోత్సహిస్తే అభివృద్ధి రంగాలు మరింత ముందడుగు వేయనుండడం, తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనుండడంతో ప్రభుత్వం ఆ దిశగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా సర్వీస్ సెక్టార్, ఉత్పత్తి సెక్టార్‌లల్లో మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ద్వారా కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధమైంది. ఇందుకోసం కొత్తగా పరిశ్రమలు స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే వారికి సబ్సిడీల రూపంలో ప్రోత్సాహకాలు అందిస్తోంది.

రూ.20 లక్షల నుంచి 50 లక్షల వరకు..

సర్వీస్ సెక్టార్‌లో 20 లక్షల పెట్టుబడుల వరకు సబ్సిడీలు ఇస్తుండగా, ఉత్పత్తి విభాగాల్లో రూ.50 లక్షల పెట్టుబడి వరకూ ప్రభుత్వం సబ్సిడీలను అందిస్తోంది. ఇందులో మున్సిపాలిటీల పరిధిలో 25 శాతం, గ్రామ పంచాయతీల పరిధిలో 35 శాతం సబ్సిడీని ఇస్తున్నారు. ఇదే అవకాశంగా చిన్నపారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చి స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలని ప్రభుత్వం పిలుపునిస్తోంది.

సర్వీస్ సెక్టార్ పరిధిలో పరిశ్రమలు..

వేబ్రిడ్జి, డీటీపీ, జిరాక్స్, హోటల్స్, ఫిజియోథెరపీ సెంటర్స్, ఎక్స్‌రే క్లినిక్స్, డాబాలు, టెంట్‌హౌస్, ఫంక్షన్‌హాల్స్, ఎంబ్రాయిడరీ వర్క్స్, జనరేటర్స్, సెంట్రింగ్, పాడిపశువుల పెంపకం, కాంక్రీట్ మిల్లర్స్, ఆప్టికల్ గ్లాసెస్ తయారీ, సౌండ్ సిస్టం, రెగ్జిన్ వర్క్స్, మొబైల్ రిపేర్, ఫ్లెక్సీ, స్క్రీన్ ప్రింటింగ్, ఏసీ రిపేర్స్, ఎలక్ట్రికల్ రిపేర్, ఫొటో స్టూడియోతో పాటు వందలాది పరిశ్రమలు ఈ విభాగంలోకి వస్తాయి.

ఉత్పత్తుల విభాగంలోని పరిశ్రమలు...

ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీ, రైస్‌మిల్స్, దాల్‌మిల్స్, మినుముల ప్రాసెసింగ్, మినీ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, స్పైసెస్ ప్రాడక్ట్స్, రెడీమేడ్ గార్మెంట్స్ తయారీ, గిఫ్ట్ ఐటమ్స్ తయారీ, కొబ్బరి పీసు ఉత్పత్తులు, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్, డెయిరీ ఉత్పత్తుల తోపాటు వందలాదిగా పరిశ్రమలను పెట్టుకోవచ్చు.

దరఖాస్తు ఇలా...

పై రెండు విభాగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునేవారు www.kviconline.gov.in pmegp అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సమాచారం కోసం జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంప్రదించవచ్చు. పరిశ్రమలకోసం దరఖాస్తు చేసిన వారికి 11 రోజులపాటు శిక్షణ ఇస్తారు. అనంతరం సర్టిఫికెట్ ఇస్తారు. పరిశ్రమ మంజూరు అయ్యాక సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేస్తుంది. మూడు సంవత్సరాలపాటు పరిశ్రమను సక్రమంగా నడిపితే అదే పరిశ్రమకు ప్రభుత్వం తిరిగి రుణం మంజూరు చేస్తుంది.

- 18 సంవత్సరాలు పైన వయస్సు ఉన్నవాళ్లు ఒక్కరుగా గానీ స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలు, ఛారిటీ ట్రస్టులుగా ఉండి పరిశ్రమలు స్థాపించవచ్చు. దరఖాస్తు చేసే వ్యక్తికి ఆధార్, పాన్‌కార్డు, మొబైల్ నంబర్ ఉండాలి. రూ.5లక్షల లోపు లోను కోరేవారికి విద్యార్హత అవసరంలేదు. రూ.5 లక్షల పైన లోనుకావాలంటే 8వ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలి. మూడు సంవత్సరాలపాటు ఒకే చోట నివాసముండాలి. రేషన్‌కార్డు ఉండాలి. పరిశ్రమ పెట్టే వ్యక్తి తన వాటాగా 5 శాతం డబ్బులు జమచేయాలి. మిగిలిన 95 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. ప్రభుత్వం 25 నుంచి 35 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఎంత పెట్టుబడితోనైనా పరిశ్రలు పెట్టవచ్చు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి



ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి. ప్రభుత్వం మంచి సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సాహకాలు అందిస్తోంది. సర్వీస్ సెక్టార్, ఉత్పత్తి రంగాల పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనే అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశాం.

– ఎస్.మదన్‌మోహన్‌శెట్టి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి, బాపట్ల

షెడ్యూల్ ప్రకారం నిర్మాణాలు

జేఎన్‌టీయూ–ఎన్ నిర్మాణ ప్రగతిపై ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి సమీక్ష



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేటరూరల్: షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ నెలకు జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాలను పూర్తిచేయాలని రాష్ట్ర ఉన్న త విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. కాకాని వద్ద నిర్మాణంలో ఉన్న జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఎమ్మె ల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజులు శనివారం సందర్శించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. హాస్టల్ భవనాలు, రోడ్లు, డ్రెయిన్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మెకానికల్, ఈసీఈ, ఎలక్ట్రికల్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

అత్యుత్తమ నైపుణ్యాలతో ఉన్నతస్థాయికి..

అత్యుత్తమ నైపుణ్యాలు, దృఢనిశ్చయంతో విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన 26వ ఓరియంటేషన్ డే, గ్రాడ్యుయేషన్ డేల్లో ఆయన పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి, పొడా వైస్ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో స్వచ్ఛత హీ సేవ

గుంటూరు లీగల్: న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది, న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు కోర్టులో స్వచ్ఛత హీ సేవకు శనివారం జయహో పలికారు. కోర్టు ప్రాంగణంలోని అణువు అణువుని శుభ్రం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మొబైల్ కోర్టు నుంచి కొత్త బిల్డింగ్‌లోని ప్రతి కోర్టుని ప్రత్యక్షంగా పరిశీలించారు. కోర్టు ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారాన్ని న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు తొలగించగా, కోర్టు సిబ్బంది వారి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసుకున్నారు. మొబైల్ కోర్టు న్యాయమూర్తి జి.స్రవంతి ఆధ్వర్యంలో సిబ్బంది కోర్టు పరిసర ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలను తొలగించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వినియోగదారుల కమిషన్ పరిసర ప్రాంతాల్లో దట్టంగా పెరిగిన పిచ్చిచెట్ల కొమ్మలను పీడీజే పార్థసారథి ఆధ్వర్యంలో ఆయా కార్యాలయ సిబ్బంది, న్యాయవాదులు తొలగించారు. గవర్నమెంట్ ప్లీడర్ పోకల వెంకటేశ్వరరావు కార్యాలయం వెనుక ఉన్న పిచ్చి మొక్కలను ఆయన ఆధ్వర్యంలో న్యాయవాదులు తొలగించారు. జిల్లా, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, కాపీ సెక్షన్, రికార్డ్ రూంలను ఆయా కార్యాలయాల సిబ్బంది శుభ్రం చేసుకుని స్వచ్ఛతకు జయహో పలికారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి సీహెచ్ రాజగోపాలరావు, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీకే సురేష్, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు లావు అంకమ్మ చౌదరి, సాయి వర ప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మకాయల ధర



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2,500, గరిష్ఠ ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,200 వరకు పలికింది.

కలెక్టరేట్‌లో స్పందన రద్దు

బాపట్ల అర్బన్ : గాంధీ జయంతి సందర్భంగా సోమవారం స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సి.హె.శ్రీధర్ శనివారం తెలిపారు.

వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కమిటీలో బాపట్ల జిల్లాకు చెందిన నలుగురిని కార్యదర్శులుగా నియమించారు. డాక్టర్ ఐ.బాబూరావు, డాక్టర్ జి.సుబ్బారావు, డాక్టర్ ఎ.శంకరరెడ్డి డాక్టర్ తిరువీధుల శ్రీనివాసరావులు నియమితులయ్యారు.

వాలీబాల్ క్రీడా పోటీలు

వినుకొండటౌన్: నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వాలీబాల్ క్రీడా పోటీలు, ఎంపికలను వినుకొండ పట్టణ శివారులోని లయోలా ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బి.అనురాధ, కె.వి.రమణబాబులు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీలు అండర్- 14,17 విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల వద్ద నుంచి ధ్రువీకరణ పొంది హాజరు కావాలన్నారు.

జగనన్న సంకల్పంతో పేదల సొంతింటి కల సాకారం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



జగనన్న కాలనీలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: పేదల సొంతింటి కల జగనన్న సంకల్పంతో నెరవేరుతోందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలను శనివారం ఆయన అధికారులతో పరిశీలించి, మాట్లాడారు. పేదవానికి సొంత గూడు కల్పించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలను వెచ్చించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36లక్షల మంది నిరుపేదలకు నివేసన స్థలాలు అందించగా ఇప్పటికే 20లక్షలకు మందికిపైగా గృహాలు నిర్మించుకున్నారని చెప్పారు. దీంతో ఊర్లకు ఊర్లే ఏర్పడ్డాయన్నారు. రేపల్లె పట్టణంలో పట్టణానికి ఆనుకుని 68 ఎకరాలలో 3200 మంది లబ్ధిదారులకు నివేసన స్థలాలు అందించగా 2వేలకు మందికిపైగా గృహాలు నిర్మించుకున్నారన్నారు. వీఆర్వో సంస్థ సహకారంతో 120 ఎస్టీ కుటుంబాలకు నిర్మించిన గృహాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. త్వరలోనే గృహాల సముదాయాలను ప్రారంభించుకోవటం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలలో కనీసం ఒకరికైనా సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు లేవని, ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, హౌసింగ్ డీఈ సుబ్బారావు, తదితరులున్నారు.

అమర్‌నాథ్ మృతిని రాజకీయం చేయటం తగదు

చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెం గ్రామంలో దుండగుల చేతిలో హత్యగావించబడిన అమర్‌నాథ్ మృతిని ఇప్పటికీ రాజకీయం చేయటం హేయమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్యకు పాల్పడిన నిందితులను 24 గంటలలోపే అరెస్ట్ చేసి మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా నిలిచి ఆదుకుందన్నారు.

పాపం అచ్చమ్మ



దాచుకున్న కరెన్సీ నోట్లతో అచ్చమ్మ

రొంపిచర్ల: పాపం ఆ వృద్ధురాలి అమాయకత్వం, తెలియని తనంతో రూ.80 వేలు వృథా చేసుకున్న సంఘటన మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో శనివారం వెలుగు చూసింది ఆ గ్రామానికి చెందిన అచ్చమ్మ 10–15 సంవత్సరాలుగా శ్రమటోర్చి రూ.80 వేలు కూడబెట్టుకుంది. కాయకష్టం చేసి సంపాదించిన కరెన్సీ నోట్లను జాగ్రత్తగా దాచిపెట్టుకోవటం తెలిసింది గానీ వాటిని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో, కరెన్సీని ఎలా చెలామణి చేసుకోవాలో కూడా తెలియని అమాయకురాలు పూర్తిగా నష్టపోయింది. కేంద్ర ప్రభుత్వం గతంలో 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేసింది. ఆ విషయం ఆ వృద్ధురాలికి తెలియదు. ఇటీవల తిరిగి రూ.2000 నోట్ల చెలామణిని కూడా నిలుపుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. శనివారం గ్రామంలో కొందరు పెద్ద కరెన్సీనోట్లు చెల్లడం లేదని, వాటిని చెలామణి చేసుకునేందుకు శనివారం ఆఖరి రోజు అని అనుకోవడం విని ఆ వృద్ధమహిళ తన వద్ద ఉన్న కరెన్సీ నోట్లను ఆ గ్రామ సర్పంచ్ దగ్గరకు తీసుకురావటంతో విషయం వెలుగు చూసింది.

మాజీ మంత్రి సత్యనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులు ఫిర్యాదు

గుంటూరుఈస్ట్: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు న్యాయవాదులు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవీంద్ర నాయక్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. మహిళ న్యాయవాది బడి మంజుల మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ విశాఖపట్నంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మంత్రి రోజాపై దిగజారి అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలపై మహిళ కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నట్లు చెప్పారు. పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వట్టి జొన్నల బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ మంత్రి రోజాకు క్షమాపణలు చెప్పాలని లేదంటే తగిన బుద్ధి చెప్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పిట్టు విజయలక్ష్మి, బాలాత్రిపుర సుందరి, కళ్లం వెంకటరమణారెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, టి.ప్రకాష్, వేముల ప్రసాద్, కాంత్రి, ఏ.శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు రేపల్లె క్రీడాకారుల ఎంపిక



విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

రేపల్లె: గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 21వ తేదిన నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో తమ కింగ్స్ వే అకాడమీ క్రీడాకారులు రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ ఫౌండర్ కే.జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక అకాడమీలో శనివారం క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. తమ అకాడమీ నుంచి తొమ్మిది బంగారు పతకాలు, మూడు రజత, నాలుగు కాంస్య మొత్తం 16 పతకాలు సాధించామన్నారు. అండర్–11 సబ్ జూనియర్స్ విభాగంలో కే.వర్షిత, షేక్ షాహీనా, సిహెచ్ ఆకాష్, క్యాడెట్ కేటగిరి అండర్–14లో పి.ప్రణవ్ సాయిరాఘవ, కె.అకిల్, కె.నేహ, కె.వైష్ణవి, జూనియర్స్ కేటగిరి అండర్–17లో సీహెచ్ కార్తీక్, సీహెచ్ హరిప్రియలు బంగారు పతకాలు సాధించారన్నారు. సబ్ జూనియర్స్ అండర్–11 విభాగంలో అబ్దుల్ హరహోమ్, జీ సోహన్, ఎ.జస్వంత్‌లు రజత పతకాలు సాధించగా, అబ్దుల్ రవోఫ్, వి.చరణ్‌గౌడ్, ఎస్.రోహన్‌రాజు, ఎస్.రోహిణిలు కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు.

విద్యార్థుల హాజరు పెంచటానికి కృషిచేయాలి

- డీఈవో పీవీజే రామారావు
- రెండో దశ నాడు–నేడు పనుల పరిశీలన



నాడు–నేడు పనులు పరిశీలిస్తున్న డీఈఓ రామారావు

అద్దంకి రూరల్: పాఠశాలలో విద్యార్థుల హాజరు పెంచటానికి ఎంఈవోలు, హెచ్ఎంలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. శనివారం స్థానిక భాష్యం పాఠశాలలో ఏడు మండలాల విద్యాశాధికారులు, ప్రధానోపాధ్యాయులతో నాడు–నేడు రెండో దశ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంతమాగులూరు మండలంలో 90 శాతం మాత్రమే విద్యార్థులు పాఠశాలకు హాజరవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. జీఈఆర్ యాప్ సర్వేలో అద్దంకి మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతరం జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం, రెండో దశ పనుల పరిశీలనలో భాగంగా పట్టణంలోని గురకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పనులను పరిశీలించారు. ఏసీఆర్ మినహా మిగిలిన వాటికి కావాల్సిన నిధుల విడుదలకు సత్వరమే టీఈవో ద్వారా నిధులను అక్టోబర్‌లో పంపిస్తామని వివరించారు. పనులు వేగవంతంగా చేయాలన్నారు. అదనపు గదులను, కిచెన్ షెడ్డు, టాయిలెట్ నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాకాధికారులు, మండల ఇంజినీరు, హెచ్ఎం పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం జరిగింది. నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై యువకుడి(30) మృతదేహాన్ని ట్రాక్‌మన్, స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. యువకుడు రైలు కింద పడటంతో తల మొండెం వేరు అయ్యింది. సంఘటన స్థలాన్ని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సునీల్‌కుమార్ పరిశీలన చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిస్తే 9440309859 నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు.

3న టెక్స్‌టైల్స్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు రూరల్: నల్లపాడులోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్స్ టైల్ టెక్నాలజీ కళాశాలలో కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులందరికీ తమ మూడున్నర సంవత్సరాల వ్యవధిగల టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో మంగళవారం ఉదయం 11 గంటల నుండి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అర్హత సర్టిఫికెట్లు రూ.5,800 అడ్మిషన్ ఫీజు తీసుకొని కళాశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలన్నారు. మూడున్నర సంవత్సరాల టెక్స్ టైల్ డిప్లొమా కోర్సులో మొదటి నాలుగు సెమిస్టర్లు కాలేజీ, ఐదు ఆరు సెమిస్టర్లు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుందని చెప్పారు. ఈ ట్రైనింగ్ కాలంలో విద్యార్థికి పరిశ్రమలు నెలకు రూ.7,000 నుంచి రూ. 10,000 వరకూ స్టైఫండ్ ఇస్తునాయన్నారు. చివరి ఏడో సెమిస్టర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు జరుగుతాయని తెలిపారు. సూపర్ వైజర్లుగా నూరుశాతం జాబ్ ప్లేస్‌మెంట్ కల్పిస్తూ సగటున ప్రతి విద్యార్థికి ప్రారంభ జీతం రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ వివరాలకు అడ్మిషన్స్ విభాగ అధ్యాపకులు యు.రాధాకృష్ణ 8500724006, జి.లక్ష్మీజ్యోతి 94918 75206 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైద్య కళాశాలలో ర్యాగింగ్‌పై విచారణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారంటూ ప్రథమ సంవత్సరం ఏడాది విద్యార్థి నేషనల్ మెడికల్ కమిషన్‌కు (ఎన్ఎంసీ) ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎన్ఎంసీ అధికారులు శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల అధికారులకు ర్యాగింగ్‌పై విచారణ చేయాలంటూ మెయిల్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం రాత్రి హాస్టల్‌లో విచారణ చేపట్టిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ ప్రదీప్ విద్యార్థులు ఎవరూ ర్యాగింగ్ జరగలేదని నివేదిక ఇవ్వడంతో శనివారం మళ్లీ విచారణ చేపట్టారు. కళాశాల సమీపంలోని కన్నావారితోటలో ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటున్న ఓ విద్యార్థిని ఐదుగురు సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్లు తెలుసుకుని సదరు విద్యార్థులను యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు విచారించారు. లిఖిత పూర్వకంగా వారి వద్ద రాయించుకుని గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్‌జీవన్ ప్రదీప్‌తోపాటు, యాంటిర్యాగింగ్ కమిటీకి చెందిన వైద్యులు విచారణలో పాల్గొన్నారు.

